క్లుప్తంగా

మఠం భూముల పరిరక్షణకు కృషి

తిరుపతి కల్చరల్: బంజారాల ఆరాధ్యదైవమైన హథీరాం బావాజీ మఠం భూములు పరిరక్షణకు కృషి చేస్తున్నామని, ప్రభుత్వం సైతం తగు చర్యలు తీసుకోవాలని మఠం పరిరక్షణ కమిటీ అశోక్ రాథోడ్, ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు వి.శివానాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మఠం ఆస్తులు కాపాడాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. బావాజీ ఆలయం నిర్మించాలని కోరారు. టీటీడీ బోర్డులో బంజారాలకు అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. సమావేశంలో బంజారా సంఘం నేతలు రవిరాథోడ్, శ్రీనివాస, లలిత, బాలాజీ, కిషోర్, ప్రకాష్ పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా పూర్ణిమాదేవి



న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందిస్తున్న న్యాయవాదులు

పాకాల : స్థానిక కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా పూర్ణిమాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తికి న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో గౌరీశంకర్‌రాజు, రెడ్డెప్పనాయుడు, గురుస్వామినాయుడు, మధుసూదన్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, సలీం, ప్రవీణ్‌ప్రకాష్, చంద్రమోహన్, రాజశ్రీనివాసులు పాల్గొన్నారు.

'మలబార్'లో వెండి ఆభరణాల ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభిస్తున్న మహిళలు

తిరుపతి కల్చరల్ : బాలాజీ కాలనీలోని మల బార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో సోమ వారం వెండి ఆభరణాల ప్రదర్శనను ప్రారంభించారు. షోరూమ్ ప్రతినిధి రెజిష్ మాట్లాడు తూ ఈనెల 24వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా వెండి సామగ్రి, పట్టీల కొనుగోలుపై 25 శాతం తగ్గింపు, వెండి ఆభరణాల ఎమ్మార్పీపై 10 శాతం డిస్కౌంట్ పొందవచ్చని వెల్లడించారు. సరికొత్త డిజైన్లలో ఆకర్షణీయమైన వెండి ఆభరణా లు, వస్తువులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

రీసెర్చ్ ప్రొఫైల్స్‌పై అవగాహన

తిరుపతి సిటీ: ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో పీహెచ్‌డీ విద్యార్థుల కోసం పబ్లిషింగ్, రీసెర్చ్ ప్రొఫెల్స్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీన్ ప్రొఫెసర్ జి.నరసింహ మాట్లాడుతూ సూచిక జర్నల్స్‌ను ప్రచురించడం, ప్రొఫెషనల్ రీసెర్చ్ ప్రొఫైల్స్ సృష్టించడం పరిశోధనలో కీలక పాత్ర వహిస్తాయని తెలిపారు. స్కోపస్ ఐడీ, ఆర్‌సీఐడీ, గూగుల్ స్కాలర్ ప్రొఫైల్‌ను సృష్టించడం వంటి విషయాలు రీసెర్చ్ విజిబిలిటీని, అకడమిక్ క్రెడిబిలిటీని పెంచడంలో సహాయపడతాయని వివరించారు. సదస్సులో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పీవీ నరసయ్య, కంప్యూటర్ సైన్స్ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ జి.అంజన్ బాబు, అధ్యాపకులు ప్రొఫెసర్ కె.విజయలక్ష్మి, డాక్టర్ ఎం.శ్రీదేవి, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ యశ్వంత్ కుమార్ పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక



ఉదయ్‌కుమార్



ప్రవీణ్ కుమార్

తిరుపతి సిటీ : ఎస్వీయూలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా మహాసభల్లో భాగంగా సోమవారం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన ఉదయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మంత్రి లోకేశ్ తన పాదయాత్ర సమయంలో జూనియర్ కళాశాలల్లో సైతం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ మాటను వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న అన్ని కళాశాలలో కులమతాలకు అతీతంగా అడ్మిషన్లు ఇవ్వాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో బోధన, బోధనేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. మెస్ చార్జీలు పెంచాలని, హాస్టళ్లకు కొత్త భవనాలు నిర్మించాలని సూచించారు. సభలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, ఉపాధ్యక్షుడు బండి చలపతి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రనాయక్, కోశాధికారి సతీష్, మోహన్, వెన్నెల పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలని వినతి

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రిలో ల్యాబ్ అటెండెంట్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన రామ్ మోహన్ కుటుంబానికి ప్రభుత్వం రూ.2లక్షల పరిహారం చెల్లించాలని ఏపీ హంస ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజా కోరారు. సోమవారం ఈ మేరకు రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభుకు వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన సూపరింటెండెంట్ త్వరలోనే బాధిత కుటుంబీకులకు పరిహారం అందిస్తామని, బాధ్యతగా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హంస సహాయ కార్యదర్శి వెంకటలక్ష్మి, మధు, గంగమ్మ, కాంచన, షకీలా, ప్రశాంతి, శంకర్, కోమల పాల్గొన్నారు.



అనుగ్రహ భాషణం చేస్తున్న కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీస్వామి

టీటీడీ పరిపాలనా భవన మైదానంలో కార్తీక దీపోత్సవానికి హాజరైన అశేష భక్తులు



దీపం..దివ్యతేజం

పవిత్ర కార్తీక సోమవారం సందర్భంగా ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. శివకేశవులను స్మరించుకుంటూ పరవశించారు. విశేష దీపాలను వెలిగించి హరిహరులకు సమర్పించారు. ఆదిమధ్యాంత రహితుని భక్తిప్రపత్తులతో సేవించుకుని పులకించారు. పవిత్ర పంచాక్షరిని జపిస్తూ తన్మయత్వం చెందారు. సర్వశుభాలను ఒనగూర్చే విశిష్ట అష్టోత్తర నామం పఠిస్తూ పునీతులయ్యారు. అత్యంత వైభవంగా జ్ఞాన జ్యోతులను ఆరాధిస్తూ అజ్ఞానాంధకారాన్ని పారదోలారు. సకల సృష్టిని రక్షించే స్థితి.. లయకారునికి చిత్తశుద్ధితో ప్రణమిల్లి మైమరిచిపోయారు.

- శోభాయమానంగా కార్తీక సోమవారం
- జ్ఞాన జ్యోతులతో ప్రకాశించిన తిరునగరం
- హరిహర స్మరణతో మార్మోగిన ఆధ్యాత్మిక క్షేత్రం

తిరుపతి (అలిపిరి) : వైష్ణవం, శైవం, శాక్తేయం తదితర సర్వ సంప్రదాయాలకు కార్తీకమాసం శ్రేష్ఠమైందని కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీస్వామి అనుగ్రహ భాషణం చేశారు. సోమవారం రాత్రి తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవన మైదానంలో అత్యంత వైభవంగా కార్తీక మహాదీపోత్సవం నిర్వహించారు. స్వామీజీ మాట్లాడుతూ శివ కేశవుల వైశిష్ట్యం, దీపం ప్రాముఖ్యతను వివరించారు. భక్తులందరికీ శ్రీనివాసుని కటాక్షం ప్రాప్తించాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారికి అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, శ్రీనివాసర్చన జరిపించారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయం పండితులు విష్ణు సహస్రనామ స్తోత్రం పారాయణం చేశారు. అర్చక స్వాములు శ్రీమహాలక్ష్మీ పూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్వీ సంగీత, నృత్య కళాశాలవారు ప్రదర్శించిన నృత్య రూపకం భక్తులను ఆకట్టుకుంది. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు గోవిందనామాలు పాడుతుండగా నక్షత్రహారతి, కుంభహారతి సమర్పించారు. టీటీడీ ఈఓ జె.శ్యామల రావు, బోర్డు సభ్యులు జంగా కృష్ణ మూర్తి, భానుప్రకాష్ రెడ్డి, జేఈఓ వీరబ్రహ్మం, డీఎల్‌ఓ వరప్రసాద రావు, తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు, హెచ్‌డీపీపీ ప్రత్యేక అధికారి రాజగోపాల్, సెక్రటరీ రఘునాథ్, రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

కపిలతీర్థంలో..

తిరుపతి కల్చరల్ : కార్తీక సోమవారం సందర్భంగా నగరంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయం, దేవేంద్ర థియేటర్ వద్ద, మంచినీళ్ల గుంట వద్ద శివాలయాలు, జీవకోనలోని జీవలింగేశ్వరస్వామి ఆలయం, మంగళంలోని అన్నపూర్ణ సమేత ఈశానేశ్వర నవలింగ క్షేత్రంలో భక్తులు దీపారాధన చేశారు. ప్రధానంగా కపిలతీర్థంలోని పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి శివలింగాలకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

సాయి మందిరంలో..

కొంకాపీధిలోని శ్రీషిరిడి సాయి బాబా మందిరంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. మబ్బు దేవనారాయణరెడ్డి, కుడితి సుబ్రమణ్యం, బాలకృష్ణ, దుర్గం శ్రీనివాస్, మర్దం శివ, రమేష్, విజయలక్ష్మి, హరిబాబు, కళావతి పాల్గొన్నారు.

ఎస్వీయూలో..

తిరుపతి సిటీ : ఎస్వీయూలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు కార్తీక దీపోత్సవం నిర్వహించారు. వీసీ దంపతులు రాజ్యలక్ష్మి, అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఆలయంలో సుమారు 50వేల దీపాలను వెలిగించారు. ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, ఎస్వీయూ ఇంజినీర్ తాండవ కృష్ణ, ఆడిటోరియం శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుర్గసముద్రంలో..

తిరుపతి రూరల్: మండలంలోని దుర్గసముద్రంలో సోమవారం 108 దీపాల కార్తీక దీపోత్సవం నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో దీపాలతో తీర్చిదిద్దిన ఓంకారం, శివలింగ ప్రతిమలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి, ఒంటెల శేఖర్, నాదమునిరెడ్డి, దామోదర్ రెడ్డి, శ్రీదేవి, మంజు, హరిప్రియ పాల్గొన్నారు.



దీపోత్సవంలో కళాకారుల ప్రదర్శన

కలెక్టరేట్‌లో కనకదాస జయంతి



పుష్పాంజలి ఘటిస్తున్న అధికారులు, కురబలు

తిరుపతి అర్బన్: కనకదాసు భారతీయ గొప్ప తత్వవేత్త, భక్తుడు, సంగీతకారుడు అని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ కొనియాడారు. కలెక్టరేట్‌లో సోమవారం కనకదాసు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి జేసీతోపాటు డీఆర్వో నరసింహులు, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి చంద్రశేఖర్, కురబ సంఘానికి చెందిన పలువురు నేతలు పుష్పాంజలి ఘటించారు. జేసీ మాట్లాడుతూ కర్ణాటక సంగీతం కోసం కన్నడ భాషలో సామాన్యులకు అర్థమయ్యే విధంగా రచనలు చేస్తూ.. కీర్తనలు రాస్తూ వేదాంతాన్ని అభ్యసించి గొప్ప కృష్ణ భక్తుడు కనకదాసు అని తెలిపారు. కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెల్లిశెట్టి కుమార్, రాష్ట్ర నేత నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు రెడ్డెప్ప, రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షులు హరినాథ్, జిల్లా యువత ప్రెసిడెంట్ మల్లయ్య పాల్గొన్నారు.

రథంపై ఆదిదంపతుల విహారం



రథోత్సవంలో భక్తులను అనుగ్రహిస్తున్న పార్వతీపరమేశ్వరులు

చంద్రగిరి : తొండవాడ స్వర్ణముఖీ నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్తీశ్వరస్వామివారి ఆలయంలో వారం రోజులుగా రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం స్వామివారికి విశేష పూజలను నిర్వహించారు. అలాగే పరివార దేవతలైన శ్రీరామచంద్రమూర్తి, శ్రీవేణుగోపాలస్వామికి అభిషేకం జరిపించారు. అనంతరం ఆదిదంపతులను ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి పాల్గొన్నారు. ఈ క్రమంలోనే మంగళవారం స్వామివారు అధికార నంది, రావణ వాహనాలపై విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు.

దానిమ్మ గింజల అలంకరణలో....

చంద్రగిరి ఆర్‌ఎఫ్‌రోడ్డులో వెలసిన శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం(పుట్టాలమ్మ)లో కార్తీక మాస పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం జరిపించారు. అనంతరం మల్లేశ్వరుని దానిమ్మ గింజలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు శివకుమార్ శర్మ పాల్గొన్నారు.

సంతృప్తికరంగా సమస్యల పరిష్కారం



అర్జీ పరిశీలిస్తున్న అదనపు కమిషనర్

తిరుపతి తుడా: అర్జీదారులకు సంతృప్తికరంగా సమస్యలు పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 29 మంది వినతి పత్రాలు సమర్పించారు. ముఖ్యంగా వీధుల్లో చెత్త తొలగించాలని, టీడీఆర్ బాండ్లు మంజూరు చేయాలని, టిడ్కో ఇళ్లు ఇప్పించాలని, మురుగునీటి కాలువలు శుభ్రం చేయించాలని తదితర సమస్యలపై అర్జీలు అందించారు. స్పందించిన అదనపు కమిషనర్ వెంటనే ఈ సమస్యలు పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఎస్వీయూలో 110 జీఓ అమలుకు వినతి

తిరుపతి సిటీ : ఎస్వీయూలోని అకడమిక్ కన్సల్టెంట్ల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని 110 జీఓను అమలు చేయాలని ఏపీ దళిత, కాపు, బీసీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శివ కోరారు. సోమవారం ఈ మేరకు వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ దళిత, కాపు, బీసీ సామాజిక వర్గాలకు చెందిన అకడమిక్ కన్సల్టెంట్లకు జీతాలు సక్రమంగా అందించాలన్నారు. దీనిపై త్వరలోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసి విన్నవిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం సెక్రటరీ డాక్టర్ ముని నరేంద్రయాదవ్, డాక్టర్ జయరామయ్య, మంజునాథ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై ఆగ్రహం

చంద్రగిరి : పాతపేటలో అక్రమంగా ఐదు అంతస్తుల భవనం నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఈమేరకు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కసాయి మార్కెట్ వీధిలో కొంత కాలంగా ఓ భవనం నిర్మిస్తున్నారని, అది ఎందుకోసమో కూడా ఎవరికీ తెలియదని, అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. ఆ ప్రాంతంలో ప్రార్థన మందిరం నిర్మించాలంటే కూడా పలు నిబంధనలు ఉన్నట్లు తెలిపారు. పేదవాడు చిన్న ఇల్లు కట్టుకుంటుంటే ఇబ్బంది పెట్టే పంచాయతీ సిబ్బంది, వారి కార్యాలయం వెనుకనే ఐదు అంతస్తుల భవనం నిర్మిస్తుంటే చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే తగు చర్యలు చేపట్టకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

అ'పూర్వ' సమ్మేళనం



చంద్రగిరి : మండలంలోని క్యాండార్ పబ్లిక్ స్కూల్‌లో తిరుపతి యశోద నగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. మూడు దశాబ్దాల నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని మురిసిపోయారు. తమ స్కూల్ వ్యవస్థాపకులు రమాదేవి, విద్యాబుద్ధులు నేర్పిన గురువును ఘనంగా సత్కరించుకున్నారు. ఆటపాటలతో గడిపి చిన్ననాటి ముచ్చట్లను పంచుకున్నారు.

నేడు 'గంగ' సరఫరాకు అంతరాయం

తిరుపతి తుడా : తిరుపతికి నీటి సరఫరా చేసే తెలుగు గంగ హెడ్‌వాటర్ వర్క్స్ నిర్వహణ పనుల కారణంగా మంగళవారం నగరంలోని కొన్ని వార్డుల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని కమిషనర్ మౌర్య తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మంగళం ఆర్టీసీ డిపో దగ్గరలో దెబ్బతిన్న పైప్‌లైన్‌కు మార్పిస్తున్నందున ఒకటవ వార్డు నుంచి 22 వరకు, 40 నుంచి 50 వరకు, 25, 26, 27, 33, 34 వార్డుల్లో నీటి సరఫరా ఉండదని వివరించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

తలకోన నీటి సాధనే లక్ష్యం

భాకరాపేట : తలకోన కొండల నుంచి నీటిని చెరువులకు తీసుకురావడమే లక్ష్యమని తలకోన నీటి సాధన కమిటీ అధ్యక్షుడు మార్లేశ్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఎర్రావారిపాళెంలో తలకోన నీటి సాధన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శిగా ఆర్.సహదేవయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీనివాసులు మాట్లాడుతూచిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, రొంపిచెర్ల మండలాల పరిధిలోని 764 చెరువులను తలకోన నీటితో నింపేందుకు పోరాడుతామని వెల్లడించారు. సమావేశంలో అంజయ్య పాల్గొన్నారు.

పనివేళల మార్పు సమంజసం కాదు

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనివేళలల మార్పును కూటమి ప్రభుత్వం పునః సమీక్షించుకోవాలని ఏపీటీఎఫ్-1938 తిరుపతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.రమేష్, ఎస్.సురేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనివేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేయాలని తీసుకున్న నిర్ణయం సరైనది కాదని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు సుమారు 5కి.మీ నుంచి పాఠశాలలకు వస్తుంటారని, పనివేళల మార్పుతో ఇబ్బందులు తప్పవని సూచించారు. వీటిని దృష్టిలో ఉంచుకుని యథావిధిగా పాఠశాలల పనివేళలను కొనసాగించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

పాఠశాలల పనివేళల పెంపు సరికాదు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయం సరికాదని ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్(ఫోర్టో) ఉమ్మడి చిత్తూరు జిల్లా చైర్మన్, ప్రధాన కార్యదర్శులు దొడ్డ ఉమామహేశ్వర్, పిల్లపాలెం మునిరత్నం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖలో అసంబద్ధ విధానాలకు స్వస్తి పలికి, ఆచరణాత్మక, తులనాత్మక శాస్త్రీయ విధానాన్ని అవలంబించాలని ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలల పనివేళలను పెంచడం శాస్త్రీయ విధానానికి, మనో విశ్లేషణ సిద్ధాంతానికి వ్యతిరేకమని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పునరాలోచించుకుని పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఆలోచింపజేసిన 'కృష్ణపక్షం'

తిరుపతి కల్చరల్ : మహతి కళాక్షేత్రంలో జస్ట్ స్మైల్ సంస్థ జె.రవీంద్ర ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శించిన «కృష్ణపక్షం» సాంఘిక నాటిక చక్కటి సందేశంతో ప్రేక్షకులను ఆలోచింపజేసింది. శ్రీపద్మనాభ నేషనల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో చేపట్టిన నృత్య, నాటకోత్సవాలు మూడోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీవినాయక నాటక కళామండలి వారిచే ప్రదర్శించిన మైరావణ పౌరాణిక నాటకం అలరించింది. కళాకారులను నిర్వాహకుడు కస్పా పద్మనాభన్ జ్ఞాపికలు, శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సామ్రాజ్యం, కేఎస్ రాజా, గుండాల గోపీనాథ్‌రెడ్డి, సిద్ధేశ్వర శర్మ, కోటేశ్వరరావు, ధనంజయరెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా లోకేష్



తిరుపతి కల్చరల్ : తిరుపతి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడుగా తిరుమలకు చెందిన కేసీ లోకేష్ నియమితులయ్యారు. సోమవారం ఈ మేరకు క్లబ్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్‌కు లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని వెల్లడించారు.

డిసెంబర్ 1న సీపీఎం మహాసభ

పాకాల : సత్యవేడులో డిసెంబర్ 1వ తేదీన సీపీఎం మహా సభ నిర్వహించనున్నట్లు పార్టీ మండల కార్యదర్శి మధుసూదన్‌రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ముందుగా ఉదయం 10 గంటలకు సాయిబాబా ఆలయం నుంచి భారీ ర్యాలీ ఉంటుందని, అనంతరం మహా సభ ప్రారంభమవుతుందని వెల్లడించారు. పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చండీహోమం.. పరిపూర్ణం



మహా పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకుడు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో ఈనెల 10వ తేదీ నుంచి 9 రోజుల పాటు చేపట్టిన కామాక్షి అమ్మవారి చండీహోమం సోమవారంతో పరిపూర్ణమైంది. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో హోమ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా యాగశాలలో ఉదయం 8 నుంచి చేపట్టిన చండీహోమం 11 గంటలకు నిర్వహించిన మహా పూర్ణాహుతితో పరిసమాప్తమైంది. అనంతరం కలశ ఉద్వాసన, మహాభిషేకం, అమ్మవారి మూలవర్లకు కలశాభిషేకం జరిపించారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు శ్రీకపిలేశ్వరస్వామివారి కలశ స్థాపన, పూజ, జపం, హోమం, నివేదన, హారతి చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం నుంచి రుద్రహోమం ప్రారంభం కానుంది. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కురబ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్ : తిరుమల, తిరుపతి కురబ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా భక్త కనకదాస జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదీ కాలనీ నుంచి లీలామహల్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, శిల్పారామం మీదుగా కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. కురబ సంఘం గౌరవాధ్యక్షుడు రెడ్డికుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా చైతన్యం కోసం కనకదాస నిరంతరం శ్రమించారన్నారు. కన్నడ, తెలుగులో అనే రచనలు చేశారని వెల్లడించారు. శ్రీవారి పరమభక్తుడైన కనకదాస గొప్ప తత్వవేత్త అని కొనియాడారు. కార్యక్రమంలో కురబ సంఘం నేతలు జి.శ్రీనివాసులు, ఎం.రెడ్డెప్ప, హరనాథ్, మల్లి, నాగసుబ్బయ్య, శంకరయ్య, ఆదినారాయణ, రఘురామ్, రాజు, నరసింహులు, పోతప్ప పాల్గొన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చంద్రగిరి : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అలాగే మ్యూజికల్ చైర్స్, చిత్రలేఖనం, కబడ్డీ పోటీలను చేపట్టారు. గ్రంథాలయాలపై విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహించినట్లు పాతపేట గ్రంథాలయం లైబ్రేరియన్ రెడ్డమ్మ తెలిపారు. విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకరమణ చౌదరి, ఉపాధ్యాయులు మోహన కుమారి, నీరజ, సరస్వతి పాల్గొన్నారు.

'శ్రీనివాస' సరిపోదా?

- కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానానికి వెన్నుపోటు!
- నాడు ఫ్లైఓవర్‌కి 'శ్రీనివాస సేతు'గా నామకరణం
- అధికారం మారడంతో గరుడ వారధిగా పేరు మార్పు
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నగర ప్రముఖులు

తిరుపతి తుడా: కూటమి నేతలు గత ప్రభుత్వ ఆనవాయితీలు ఏమీ లేకుండా చేయాలని కుట్ర పన్నుతున్నారు. ఇందులో భాగంగానే సచివాలయాలు, ప్రభుత్వ భవనాలపై పేర్లు, రూపురేఖలు మార్చుతూ రాక్షసానందం పొందుతున్నారు. ఇప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా తిరుపతిలో నిర్మించిన శ్రీనివాస సేతు పేరునూ మార్చుతూ కుటిల రాజకీయానికి తెరలేపారు. గతంలో కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానానికి తూట్లు పొడుస్తూ.. రాత్రికి రాత్రే శ్రీనివాస సేతు పేరును గరుడ వారధిగా మార్చుతూ నిర్ణయం తీసుకోవడంపై నగర ప్రజలు రగిలిపోతున్నారు.

పరిశీలన తర్వాతే నాడు పేరు మార్పు

తిరుపతికి ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని ఫ్లైఓవర్‌కి శాస్త్రీయంగా ఉండేలా శ్రీనివాస సేతుగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిలర్ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఒక్క కార్పొరేటర్ మినహా మిగిలిన 47 మంది కార్పొరేటర్లు శ్రీనివాస సేతుగానే ఉండాలని మద్దతు ప్రకటించారు. ఇప్పుడు కౌన్సిల్ ఆమోదించకుండానే కూటమి ప్రభుత్వం శ్రీనివాస సేతుగా ఉన్న ఫ్లైఓవర్ పేరును గరుడ వారధిగా మార్పు చేయడం పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



శ్రీనివాస సేతు ఫ్లైఓవర్

నారావారిపల్లి వేదికగా కుట్ర

సీఎం సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు దహన సంస్కారాలకు ప్రముఖులంతా హాజరయ్యారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న టీటీడీ చైర్మన్‌తో శ్రీనివాస సేతు పేరు మార్పుపై కొందరు నాయకులు చర్చించించినట్లు తెలుస్తోంది. కౌన్సిల్ తీర్మానం లేకుండా పేరు మారిస్తే రాజకీయంగా, టెక్నికల్‌గా సమస్యలు ఎదురవుతాయని కొంతమంది చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా సోమవారం జరిగే టీటీడీ బోర్డు మీటింగ్‌లో పేరు మార్పును టేబుల్ అజెండాగా ప్రతిపాదించి ఆమోదించేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు సమాచారం. సీఎంతోపాటు మంత్రులు నారావారిపల్లెకు వచ్చే అవకాశం ఉన్నందున ఏదో ఒక మార్పు చూపించాలన్న ఉద్దేశంతో శనివారం రాత్రి ఆదేశించాక ఆదివారం తెల్లవారుజాము కల్లా గరుడ వారధిగా పేరు మారుస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.మౌర్యకు కనీస సమాచారం ఇవ్వకుండానే ఆప్కాన్ సంస్థ ఆగమేఘాలపై గరుడ వారిధిగా బోర్డులను ఏర్పాటు చేసింది. అయితే సోమవారం జరిగిన టీటీడీ బోర్డు మీటింగ్‌లో ఫ్లైఓవర్‌కి గరుడ వారధిగా పేరును మారుస్తున్నట్లు టేబుల్ అజెండాగా ఆమోదించారు. బోర్డు మీటింగ్ నిర్ణయానికి రెండు రోజులు ముందే పేరు మార్పు చేయడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై కార్పొరేటర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.